క్లుప్తంగా

దర్గా ర్యాంప్‌నకు అదనపు నిధులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ బాబా దర్గా వద్ద ర్యాంప్ నిర్మాణ పనులకు మంత్రి సబితారెడ్డి అదనంగా రూ.4.65కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఇప్పటికే రూ.9.60కోట్లు నిధులు మంజూరైనప్పటికీ.. పనులు నత్తనడకన సాగుతుండడం.. మంత్రి చొరవ తీసుకోవడంతో గుట్టపైకి వెళ్లే ర్యాంపు నిర్మాణ పనులకు ఈ నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.14.25 కోట్ల వ్యయంతో దర్గా రోడ్డు, గుట్టపై పార్కింగ్ తదితర సౌకర్యాల కల్పనకు ఈ నిధులు వెచ్చించనున్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసినందుకు దర్గా కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

ఖుర్బానీ వ్యర్థాల సేకరణకు కవర్ల పంపిణీ



మజీద్‌లలో కవర్లను పంపిణీ చేస్తున్న షేక్ అఫ్జల్

పహాడీషరీఫ్: బక్రీద్ సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు ఖుర్బానీ వ్యర్థాలను సేకరించేందుకు కవర్లను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాదీ, కమిషనర్ వసంత పర్యవేక్షణలో అన్ని వార్డులలోని మజీదులలో ఈ కవర్లను అందజేశారు. వాదే ముస్తఫా బస్తీలోని జామా మజీద్‌లో ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్ బస్తీ వాసులకు కవర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈద్గాలో ఖుర్బానీ చేయడం ఆనవాయితీగా వస్తుందని.. ఇందుకు సంబంధించిన వ్యర్థాలను మున్సిపాలిటీ తరపున అందజేసిన కవర్లలో నింపి అందజేయాలని కోరారు.

రిక్వెస్ట్ బస్ స్టాప్‌ల ప్రారంభం

వనస్థలిపురం: వనస్థలిపురం డబుల్ రోడ్డులో ఓ వైపు ప్రశాంత్‌నగర్, మరో వైపు వనస్థలి హిల్స్ కాలనీల ప్రజల సౌకర్యం కోసం రెండు వైపులా టీఎస్‌ఆర్‌టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రశాంత్‌నగర్, వనస్థలి హిల్స్ కాలనీల రిక్వెస్ట్ బస్‌స్టాప్‌లను ఆయన ప్రారంభించారు. ప్రశాంత్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలాజీనాథ్, వనస్థలిహిల్స్ అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్, నాయకులు సంరెడ్డి భుజంగారెడ్డి, బూడిద యుగంధర్‌రెడ్డి, ప్రసాద్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



ఆర్‌కేపురం అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీమన్నారాయణుడి విగ్రహం

దిల్‌సుఖ్‌నగర్: భక్తులు ఉపవాస దీక్షలతో, భక్తి ప్రపత్తులతో జరుపుకొనే తొలి ఏకాదశి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మలక్‌పేట్ జోన్ పరిధిలో ఏకాదశి పర్వదినాన్ని భక్తిప్రపత్తులతో జరుపుకొనేందుకు ఆలయాలను సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అక్బర్‌బాగ్, మాదన్నపేట తదితర ప్రాంతాలలో ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రధాన ఆలయాలలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైష్ణవ దేవాలయాలతో పాటు శివాలయాలను పూలమాలలు, విద్యుత్ దీపాలలతో అందంగా ముస్తాబు చేశారు.

అభివృద్ధే లక్ష్యం

కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో ప్రారంభించిన మట్టి రోడ్డు పనులను డీఈ దామోదర్‌రావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో అనేక భూసమస్యలు ఉన్నాయని.. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కావడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. తహసీల్దార్ సుచరితను కలిసి బుధవారం పలు గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ పనులు వదిలేసి రైతులు నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గ్రామాల్లో వెంటనే స్పెషల్‌డ్రైవ్ చేపట్టి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కార్పొరేషన్ గ్రాఫ్ కనుమరుగు

- ప్రజా సమస్యలు గాలికొదిలేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- జెండాలు వేరైనా నేతలంతా ఒకటే అంటున్న ప్రజలు



బడంగ్‌పేట కార్పొరేషన్ కార్యాలయం

బడంగ్‌పేట్: రాష్ట్రంలో రెండో ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా పేరు గడించిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ గ్రాఫ్ ఏడాదిన్నరగా పడిపోయింది. ఇది పంచాయతీ పాలనకన్నా తక్కువగా ఉండడం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. క్రమం తప్పకుండా పన్నులు కడుతున్న ప్రజలు.. అధికారులు, ప్రజాప్రతినిధులు మౌలిక వసతులు కల్పిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ వారు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు, రాష్ట్రం నుంచి వస్తున్న నిధులు, టీడీఆర్ రూపంలో, రిజిస్ట్రేషన్ల రూపంలో క్రయవిక్రయాల రూపంలో, ఆస్తి మార్పిడి విషయంలో, పన్నుల చెల్లింపు, కమర్షియల్ ట్యాక్సులు, నల్లా ట్యాక్సులు ఇలా అన్ని వైపుల నుంచి బడంగ్‌పేటకు ఆదాయం వస్తోంది. వచ్చిన నిధులతోనే కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

నిధుల లెక్కలు రహస్యం

సీడీఎంఏ ఆదేశాల మేరకు బడంగ్‌పేట కార్పొరేషన్‌కు సంబంధించి అత్యవసర సమావేశాలు, కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలు చర్చించి నిర్ణయం తీసుకునేందుకు బదులుగా ఉన్న నిధులు, వచ్చిన నిధులు, ఏఏ కార్పొరేటర్‌కు ఎన్ని కేటాయించే విషయంలో మాత్రం అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఇండిపెండెట్ కార్పొరేటర్లు నిధుల విషయంలో వాడీ వేడి చర్చలు జరుపుకున్నప్పటికీ ప్రజలకు తెలియకుండా రహస్యంగా ఉంచుతున్నారు.

డబ్బులిస్తేనే ఓటేశారు

టీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ, ఇండిపెండెంట్‌లుగా ఎన్నికల్లో దిగి కోట్లు ఖర్చుపెట్టాం.. ఓటర్లు వేలకు వేలు వసూలు చేశారు. మా పరిస్థితి ఏం కావాలి అంటూ ప్రజాప్రతినిధులు బహిరంగంగానే సమాధానమిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. డబ్బులు తీసుకోకుండా ఉన్న ఓటర్‌కు మాత్రమే పని చేసి పెడ్తామని నిక్కచ్చిగా చెబుతున్నారు. అందుకే ప్రజల సమస్యలు కౌన్సిల్‌లో చర్చించడం లేదని కార్పొరేటర్లు అంటున్నారు.

మేయర్ పార్టీ మారడంతో మరిన్ని సమస్యలు

బీఆర్‌ఎస్‌లో ఉన్న మేయర్ కాంగ్రెస్‌లో చేరడంతో సమస్యలు పెరిగాయని ప్రజలు వాపోతున్నారు. మంత్రి సబితారెడ్డి పెద్ద ఎత్తున నిధులు తెచ్చి బడంగ్‌పేట కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే వర్గీయులు పేర్కొంటుండగా, కాంగ్రెస్‌లో చేరిన మేయర్ పారిజాత వర్గీయులు అసలు అభివృద్ధి లేదని వాదించుకుంటున్నారు. బీజేపీ కార్పొరేటర్లు మిన్నకుండిపోతున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఏకతాటిపై ఉండి పనులు చేస్తున్నారనే అపవాదు ఉంది.

విత్తన శుద్ధితో రైతులకు లబ్ధి

మహేశ్వరం ఏడీఏ సుజాత



మహేశ్వరం: విత్తన శుద్ధితో చీడపీడల బెడద లేకుండా అధిక దిగుబడి పొందవచ్చునని మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) సుజాత అన్నారు. వానాకాలం సీజన్‌లో ముందస్తు ప్రణాళిక రూపొందించి రైతులకు కావాల్సిన ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసినా తొలి దశలో నేల, విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చే పురుగులను నియంత్రించాలంటే విత్తనశుద్ధి ప్రక్రియ తప్పనిసరియని ఆమె వివరించారు.

నేల

నేల శుద్ధికి 100 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మా విరిడిని తీసుకుని నీడలో బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని వారం పాటు ఉదయం, సాయంత్రం నీ టితో తడుపుతూ మాగబెట్టాలి. పొలంలో తేమ ఉన్నప్పుడు ఒక ఎకరం విస్తీర్ణంలో చల్లుకోవాలి.



విత్తన శుద్ధి ప్రక్రియ

వరి

మెట్ట వరి సాగుకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ పట్టించి, ఆరబెట్టి విత్తుకోవాలి. నారుమడి పద్ధతిలో సాగు చేయాలనుకుంటే రైతులు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్ కలిపి 24 గంటలు నీళ్లలో నానబెట్టాలి. అనంతరం మండెకట్టి ముక్కు పగిలిన విత్తనాన్ని విత్తుకోవాలి.

కంది

కిలో విత్తనానికి 3 గ్రాముల థ్రాప్తాన్ పట్టించాలి. ఆ తర్వాత 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని పట్టించాలి. అరగంట తర్వాత 200–400 గ్రాముల రైజోబియం కలిపి విత్తుకోవాలి.

జొన్న

కిలో జొన్న విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్, 4 గ్రాముల థయోమిథాక్సమ్ పట్టించి అరగంట నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

బీజేపీతోనే ప్రజలకు భరోసా



అల్మాస్‌గూడలో కార్మికులతో మాట్లాడుతున్న అందెల శ్రీరాములుయాదవ్

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: బీజేపీతోనే ప్రజలకు భరోసా ఉంటుందని.. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం 7వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా ఆయన అల్మాస్‌గూడలోని పలు డివిజన్లల్లోని కాలనీల మీదుగా ఇంటింటికి తిరుగుతూ తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కార్మికుల కష్టాలను తెలుసుకుంటూ పాదయాత్ర కొనసాగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఇంటింటికి నల్లా నీరు అని చెప్పి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాజీవ్ గృహకల్పలో నిర్మించిన మంచినీటి ప్రారంభించక ముందే శిథిలావస్థకు చేరుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురి, పద్మ, సునీత, లక్ష్మారెడ్డి, రమాదేవి, ఇంద్రాసేన, అనిత, శంకర్, మహిళా అధ్యక్షురాలు మమత నాయకులు శూరకర్ణారెడ్డి, పుల్లారెడ్డి, యాదగిరి, రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకులమైలారం, గుమ్మడవెల్లి వీబీఓగా యాదగిరి



ఆకులమైలారం సర్పంచ్‌కు నియామకపత్రం చూపుతున్న వీబీఓ

కందుకూరు: టీఎస్‌ఆర్టీసీ సేవలను పల్లెలకు చేరువయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇటీవల ఆ సంస్థ ఎండీ సజ్జనార్ ప్రకటించిన విధంగా ఆర్టీసీ ఉద్యోగులను పల్లెలకు పంపించి ప్రజలకు ఆర్టీసీ సేవలు అందేలా ప్రయత్నాలు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కదిద్దేలా ఆర్టీసీ గ్రామ బస్సు అధికారుల(వీబీఓ)ను నియమించే పనులు చేపట్టింది. ఆర్టీసీని ఆర్థిక కష్టాలను గట్టెక్కించడంతో పాటు ప్రజలకు సేవలను విస్తృతం చేసేలా ప్రయత్నాలు చేపట్టారు. అందులో భాగంగా ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ అశోక్‌రాజు ఆదేశాలతో బుధవారం ఆర్టీసీ ఉద్యోగి గంధం యాదగిరి ఆకులమైలారం, గుమ్మడవెల్లి సర్పంచ్‌లు కలమ్మరాజు, ప్రభాకర్‌లకు తన నియామక పత్రాన్ని అందించి సహకరించాలన్నారు. ఆర్టీసీకి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అధిక ధరలకు పాఠ్యపుస్తకాల విక్రయం

పుస్తకాల గదిని సీజ్ చేసిన అధికారులు

ఆమనగల్లు: విద్యార్థులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలియడంతో బుధవారం ఏబీవీపీ నాయకులు పాఠశాలను సందర్శించారు. అదే సమయంలో పాఠశాలలోని ఓ గదిలో పుస్తకాలను విక్రయిస్తుండటంతో వెంటనే ఏబీవీపీ నాయకులు మండల విద్యాధికారి సర్దార్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రైవేటు పాఠశాలను సీఆర్‌పీ షేక్ అహ్మద్ తనిఖీ చేసి పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలు ఉన్న గదిని సీజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు భరత్, మల్లేశ్, అంజి, శివ, శివగౌడ్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే ప్రతి దాడులు చేస్తాం

బీజేపీ నేతలకు బీఆర్‌ఎస్ నాయకుల హెచ్చరిక

బడంగ్‌పేట్: బీజేపీ నాయకులు దళితులపై దాడి చేయడం నానాటికి పెరిగిపోతోందని.. దాడులు చేస్తే ప్రతిదాడులకు దిగుతామని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. బుధవారం వారు బడంగ్‌పేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంపర్క్ అభియాన్ పాదయాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములను ప్రశ్నించిన ముత్యాల నర్సింహపై తన అనుచరులు దాడి చేయడం సరికాదన్నారు. దళితలపై దాడులు చేయడమే మీ పార్టీ నేర్పిన సంస్కృతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబితారెడ్డి అభివృద్ధి చేయనిదే మీరు తిరుగుతున్న రోడ్లు, ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. స్పెషల్ ఫండ్స్‌పై స్పందిస్తూ అలాంటి ఫండ్స్ ఏమైనా ఉంటే ప్రధాని మోదీ, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు తీసుకు రాలేదని ఎద్దేవా చేశారు. దళితుడైన నర్సింహ కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిచో ప్రతిదాడులు తప్పవన్నారు. మీర్‌పేట పోలీసులు నర్సింహ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, తుఫాన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చిత్రం సాయి, బాలేశ్ చారి, శ్రీనివాస్, దళిత నాయకులు సంజీవ, దర్శన్, జంగయ్య, రవి, శ్రీను, వెంకటేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ జలీల్

మహేశ్వరం: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దుబ్బచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రిలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, నర్సులు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సరైన సలహాలు, సూచనలు ఇస్తూ అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సరైన మందులు ఇవ్వాలని చెప్పారు. చిన్నారులకు వ్యాక్సిన్లు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్, కేసీఆర్ కిట్, కంటి వెలుగు కింద అద్దాల పంపిణీతో పాటు పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవికుమార్, నర్సులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జలీల్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా హస్తినాపురం డివిజన్ వెంకటేశ్వరకాలనీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి సామ రంగారెడ్డి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా తాను దేశ్‌కీనేత అంటూ ఇతర రాష్ట్రాలలో పర్యటించడం కేసీఆర్ అవివేకానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయక పోవడం దురదృష్టకరమన్నారు. నేతలు అమరేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, మల్లేశ్‌గౌడ్, కోట్ల శివ, సాయి కిషోర్, రాజుగౌడ్, మాధవరెడ్డి, జీవన్‌రెడ్డి, అరుణ్ సింగ్, శిరీష, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ఎంపీటీసీ సభ్యుడు సురేశ్

కందుకూరు: రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు గ్రామాభివృద్ధికి సహకరించాలని జైత్వారం ఎంపీటీసీ సభ్యుడు గుండాల సురేశ్ అన్నారు. మండల పరిధిలోని బాచుపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణికి రూ.10లక్షల ఎమ్మెల్యే నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను బుధవారం ఆయన సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించిన మంత్రి సబితారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమలతారెడ్డి, నాయకులు ఇన్నారెడ్డి, రాఘవేందర్, అంజయ్య, అనంతమ్మ, బాలమల్లేశ్ యాదవ్, నరసింహ, నరేశ్, శంకరయ్య, రాంచంద్రయ్య, బి.రాములు, బాల్‌రెడ్డి, పెంటయ్య, కృష్ణ, వెంకటేశ్, ఎ.కృష్ణ, కె.రాములు, శ్రీను, జంగయ్య, అనిల్, సంతోశ్, రామకృష్ణ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు

ఉత్తమ పొదుపు సంఘంగా 'నేతాజీ'



జ్ఞాపిక అందజేస్తున్న పాలమాకుల అభ్యుదయ సమాఖ్య సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

మహేశ్వరం: రుణాలు సక్రమంగా ఇచ్చి సకాలంలో వసూలు చేసినందుకుగాను మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘానికి ఉత్తమ పొదుపు సంఘం అవార్డు వరించింది. మంగళవారం రాత్రి అమీర్‌పేట్ గ్రామంలో పాలమాకుల అభ్యుదయ సమాఖ్య 11వ మహాసభను నిర్వహించారు. నేతాజీ పొదుపు సంఘంలో 650మంది సభ్యులుండగా రూ.1.80కోట్లు జమయ్యాయని సంఘం సభ్యులు తెలిపారు. ఈ సభలో సంఘంలో ఎక్కువ మంది సభ్యులను చేర్పించి.. తక్కువ వడ్డీకే రుణాలు అందించి.. అత్యుతమ ఫలితాలు సాధించిన నేతాజీ పొదుపు సంఘం సమాఖ్య అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసచారి, సిద్దులు, దయానంద్ గౌడ్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్, మల్లేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ ధ్రువీకరణ పత్రం కావాలా?

- వధూవరులు రెండు మొక్కలు నాటాల్సిందే
- వినూత్న కార్యక్రమానికి ఏడాది పూర్తి

కడ్తాల్: నూతనంగా వివాహం చేసుకున్న వధూవరులకు వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలకు రావడం వారికి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు వివాహ ధృవీకరణ పత్రాలు అందజేయడం అన్ని గ్రామాల్లో జరిగేదే.. దీనికి భిన్నంగా కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి వినూత్నంగా ఆలోచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలనే ఆలోచనతో.. వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చే నూతన వధూవరులకు విధిగా రెండు మొక్కలు నాటితేనే వారికి సంబంధిత పత్రం ఇస్తామంటూ షరతు పెట్టారు. ఈ కార్యక్రమానికి ప్రశంసలతో పాటు అనూహ్యమైన స్పందన రావడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధిలో వివాహం జరిగిన దంపతుల చేత స్థానిక పల్లె ప్రకృతివనం, అనువైన స్థలాలో మొక్కలు నాటిస్తూ వారికి ధ్రువీకరణ పత్రాలు అందచేస్తూ వస్తున్న సర్పంచ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈ మేరకు బుధవారం నూతన వధూవరులు అశ్విని–సురేశ్, కావేరి శివకిరణ్ చేత స్థానిక పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటించి వారికి వివాహ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఏడాది కాలంగా పంచాయతీ పరిధిలో 100 మంది వధూవరుల చేత మొక్కలు నాటించి వారికి వివాహ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఏడాదిగా పర్యావరణ పరిరక్షణకు సహకరించిన వధూవరులకు, సహకరించిన గ్రామ ప్రజలకు, పాలకమండలి సభ్యులకు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి రాఘవేందర్, వార్డు సభ్యులు గణేశ్, నాయకులు యాదయ్య,ముత్తికృష్ణ, జంగయ్య, గ్రామస్తులు ఉన్నారు.



వధూవరులతో మొక్కలు నాటించి వివాహ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సర్పంచ్

సామర్థ్యాల పెంపే లక్ష్యంగా..

- వాయిస్ ఫర్ గర్ల్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాలోని ఆరు గురుకులాల నుంచి ఎంపిక
- నల్లకంచె గురుకులంలో కొనసాగుతున్న క్యాంప్



వాయిస్ ఫర్ గర్ల్స్ (వీఫోర్‌జీ) ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన



ప్రముఖుల ఫొటోలతో చార్ట్స్ ప్రిపేర్ చేసిన విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికల్లోని సృజనాత్మకతను, నాయకత్వ పటిమను, సామర్థ్యాన్ని వెలికితీసి వారిని చైతన్య మూర్తులుగా తీర్చిదిద్దేందుకు 'వాయిస్ ఫర్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ కృషిచేస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతనంతో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో ఉంటూ చదువుకునే బాలికలు (విద్యార్థినులు)వేల సంఖ్యలో ఉన్నారు. అలాంటి వారిలో చైతన్యం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు మానసిక ధృడత్వం పెంచేలా వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుంది.

124 మందికి శిక్షణ..

ఇబ్రహీంపట్నం, ఆర్కేపురం, సరూర్‌నగర్, మహేంద్రహిల్స్, నార్సింగి, శంకర్‌పల్లిల్లో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివే 124 మంది విద్యార్థినులకు స్థానిక నల్లకంచెలోని బాలిక గురుకుల పాఠశాలలో ఈనెల 20వ తేదీ నుంచి ఈ ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రముఖుల చరిత్ర, నేటి సమాజ పోకడలు, రాజకీయ అంశాలు, ఆంగ్లంపై పట్టు, ఆటలు, పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్, ఏకాగ్రత సాధన, ఉపన్యాసాలపై ప్రత్యేక శిక్షణను పొందుతున్నారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎస్.శ్వేత ఎప్పటికప్పుడు ఈ శిక్షణను పర్యవేక్షిస్తుండగా.. కౌన్సెలర్లుగా తన్వీ, సుప్రియా, కరీనా వ్యవహరిస్తూ విద్యార్థులకు మంచి తర్ఫీదును ఇస్తున్నారు. ఈ శిక్షణతో ఎలాంటి కఠిన సమస్యలనైనా ఎదుర్కొంటామనే మనోధైర్యం బాలికల్లో స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు శిక్షకులు. పాఠశాలలో ఈనెల 30న నిర్వహించే ముగింపు కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరౌతున్నట్లు సమాచారం.

నైపుణ్యాలు మెరుగుపడతాయి

జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఈ శిక్షణ ఎంతో తోడ్పాటునందిస్తుంది. కౌమారదశలో ఈ శిక్షణను పొందడంతో విద్యార్థినుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి వెలికి వస్తుంది. వారి జీవన ప్రయాణాన్ని తెలియజేస్తుంది. వారితో జ్ఞానాన్ని పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– శ్వేత, ఫీల్డ్ కోఆర్డినేటర్

స్నేహితులతో పంచుకుంటా



ఈ శిక్షణతో నాలో ఎంతో మార్పు వచ్చింది. ధృడ సంకల్పంతో ఏదైనా సాధించగలననే నమ్మకం ఏర్పడింది. ఆరోగ్యం, భద్రత, హక్కులు, నాయకత్వ లక్షణాలు ఎలా ఉంటాయో తెలిసింది. ఇక్కడ నేర్చుకున్న విషయాలను నా కుటుంబం, స్నేహితులతో పంచుకుంటాను. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

– నవనీత, 8వ తరగతి, నార్సింగి గురుకుల పాఠశాల

నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నా



ఏదైనా సమస్య వస్తే సంఘర్షణకు తావులేకుండా మర్యాదపూర్వకంగా ఎలా పరిష్కరించుకోవచ్చో తెలిసింది. మార్గదర్శకులు కావాలంటే నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యం. శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ఇక్కడి ఉపాధ్యాయులు అందించిన శిక్షణ భవిష్యత్తులో నా ఉన్నతికి తోడ్పడుతుంది. తోటి స్నేహితులతో ఇక్కడి విషయాలను పంచుకుంటాను.

– శర్వాణి, 8వ తరగతి, మహేంద్రహిల్స్ గురుకుల పాఠశాల